క్లుప్తంగా

'ఇందిరమ్మ' ఇళ్ల సర్వే పరిశీలన

కల్లూరురూరల్: ఇందిరమ్మ గృహాల సర్వేపై కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న గృహాలు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ గృహాల యాప్‌లో అర్హులైన పేదల వివరాలు నమోదు చేశారా లేదా అనే విషయాన్ని ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ పరిశీలించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

వైరా: వైరా పాత బస్టాండ్ సెంటర్‌లోని పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభించామని ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ పోస్టు మాస్టర్ వై.కోటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీపీఎం రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి

కల్లూరు: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫీజులను ఈ నెల 30లోపు చెల్లించాలని మధిర స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శీలం ఇందిర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మధిర స్టడీ సెంటర్ (094), ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెల్ నంబర్ 7382929694ను సంప్రదించాలని ఆమె కోరారు.

కూలి రేట్లు పెంచాలి

తల్లాడ: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా తల్లాడ పట్టణంలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య అన్నారు. తల్లాడలో శనివారం పటాన్ నాగుల్‌మీరా అధ్యక్షతన జరిగిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల వేతనాలు 50శాతం పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్‌లైతే వ్యాధులు దరిచేరవని గంగారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాజా, రమాదేవి సూచించారు. శనివారం పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వండిన ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి వెంకటేశ్వరరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనివేళలు మార్చాలి

మధిర: గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి కోరారు. శనివారం మండలంలో ఉన్న గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలను పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి యూనియన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పనివేళలు మార్చాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

వేంసూరు: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వేంసూరు మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లు, డైరీలను శనివారం వేంసూరు జిల్లా ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరు వృత్తి పట్ల అంకితా భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కౌన్సిలర్ ఫకీర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

బోనకల్: మండలంలోని కలకోటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈఓ ఎంగల ప్రభాకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు, రైతులు, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కారేపల్లి: ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు సింగరేణి గ్రామస్తులు శనివారం వినతి పత్రం అందజేశారు. సింగరేణి (కారేపల్లి) రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలం సర్వేనంబర్ 38లో ఉన్న బీసీ హాస్టల్ పక్కా భవనానికి కేటాయించిన స్థలాలను కొంతమంది ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఇప్పటికే హిందూ శ్మశానవాటిక, బస్టాండ్ సెంటర్ ప్రాంతాల్లో స్థలాలు ఆక్రమణకు గురైయ్యాయన్నారు. ఇకనైనా అధికారులు హద్దులు నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, వీరభద్రాచారి, రియాజ్, కోటయ్య, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఎదురుచూపులే..

గీత కార్మికులకు అందని సంక్షేమ పథకాలు

- ప్రమాద బీమా కోసం ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆవేదనలో గౌడ కులస్తులు



ముత్తారంలో జరిగిన సంఘటనలో కాళ్లు విరిగిన శంకర్‌గౌడ్ (ఫైల్)



గోకినేపల్లిలో తాటిచెట్టు ఎక్కుతున్న కల్లుగీత కార్మికుడు

ముదిగొండ: గీత కార్మికుల సంక్షేమానికై ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకై ఏడాదిగా కార్మికులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో కాటమయ్య రక్షణ కవచం మినహా కార్మికులకై ఏ ఒక్క హామీను కూడా నెరవేర్చలేదు. యాభైఏళ్లు నిండిన గీత కార్మికులకు ప్రస్తుతమిస్తున్న రూ.2వేల పెన్షన్‌ను.. చేయూత పథకం ద్వారా రూ.నాలుగు వేల వరకు పెంచుతామని ప్రకటించి ఏడాది అవుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. మద్యం షాపుల్లో ఇస్తున్న 15శాతం రిజర్వేషన్ 25శాతానికి పెంచి కల్లుగీత సొసైటీలకు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

ఇబ్బంది పడుతున్న గీతకార్మికులు..

గీత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని గీతకార్మికులు తమ ఖష్టార్జితంపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలున్నాయి. ఇల్లు, పిల్లల చదువులు, ఖర్చులు అన్ని గీత వృత్తిలోనే వెళ్లదీసుకుని బ్రతుకుతున్నారు. పాలకులు మారితేనైనా తమ బతుకులు మారతాయని కన్న కలలు కలలుగానే మిగిలిపోయాయి. కార్మికులకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువైంది. ప్రమాదమని తెలిసినా పొట్టకూటికోసం తాటి, ఈత చెట్లు ఎక్కి కుటుంబాన్ని పోషించుకుంటున్న వారి జీవనం రోజురోజుకు ప్రశ్నార్థకంగా మారింది ? ఇకనైనా ప్రభుత్వం సంక్షేమ పథకం ద్వారా ఆదుకోవాలని గీత కార్మికులు కోరుతున్నారు.

మండలంలో వివరాలిలా..

నేలకొండపల్లి ఆబ్కారీ శాఖ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లోని 44 సొసైటీల్లో.. 3,900 మంది గీత కార్మికులు ఉన్నారు. ప్రతి ఏటా తాటి, ఈత చెట్లపైనుంచి ప్రమాదవ శాత్తు కిందపడి గాయాలు పాలైనవారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. చనిపోయినవారు ఏటా ఐదారుగురుంటున్నారు. మూడు మండలాల్లో సభ్యత్వం కలిగిన వారిలో పింఛన్ దారులు సగం మంది ఉంటే, 50సంవత్సరాలు దాటి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారు సగం మంది ఉన్నారు. ప్రభుత్వం చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాయాలైనవారికి రూ.10వేలు, మరణిస్తే రూ.5లక్షలు ఇస్తానని ప్రకటించిన హామీని మరచిందన్నారు.

సన్నగిల్లుతున్న గీతవృత్తి..

ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా గౌడ సంఘంలో ఈత, తాటి విత్తనాలు ఇచ్చి నాటుకొమ్మని చెపుతున్న అధికారులు, వాటిని పెంచడానికి స్థలాలు, వనాలు లేవు. దీంతో గీత వృతి సన్నగిల్లుతోంది. ప్రభుత్వం బీసీలకు, కులవృత్తుల వారికి గౌడ, పద్మశాలి, ముదిరాజ్, గొల్లకురుమ, మున్నూరుకాపు బీసీలకు రుణాలు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

కల్లు ప్రకృతి పానీయం..



తాటి, ఈత చెట్ల కల్లు ప్రకృతి పానీయంగా పరిగణిస్తారు. స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. డ్రింగ్స్, లిక్కర్ లాంటివి తాగడం వలన ప్రజలు అనేక రకాల జబ్బుల బారిన పడుతున్నారు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని ఆర్థింగా కుంగిపోతున్నారు.

– గాలి అంజయ్యగౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

పింఛన్ రూ.6వేలు ఇవ్వాలి..



వృత్తిపరంగా కల్లుగీసుకుని జీవనం సాగించే మాకు పింఛన్ రూ.6వేలు ఇవ్వాలి. బీసీలకు ఇచ్చే రుణాలలో గీత వృత్తిదారులను గుర్తించి, రుణాలు అందించాలి. తాటి, ఈత వనాలు పెంచడానికి ప్రభుత్వం భూమి కేటాయించాలి. చేతి వృత్తిదారులందరికీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

– మొక్క నాగేశ్వరరావు గౌడ్, కల్లుగీత కార్మికుడు, గోకినేపల్లి

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని విద్యాభారతి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు కొత్త న్యాయ చట్టాలు, కోర్టులు, విధులు, కోర్టుల్లో రకాలను వివరించారు. క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.లింగారెడ్డి, జూనియర్ న్యాయవాదులు అరుణకుమారి, రజిని, ప్రసాద్, పద్మ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనలు ఎత్తివేయాలి

వైరా: రైతు భరోసా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల పూర్తి డేటా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ వద్ద ఉండగా కొత్తగా దరఖాస్తు లెందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంక్రాంతి మధుసూధనరావు, చింతనిప్పు చలపతిరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, సంక్రాంతి నరసయ్య, పురుషోత్తం, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమానికి నగదు వితరణ

సత్తుపల్లిరూరల్: నల్లబోతుల మంగయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మంగయ్య కుమారుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఆర్‌డీఏ పీడీ నల్లబోతుల రవి శనివారం సత్తుపల్లి పట్టణం సిద్ధారంరోడ్ గల స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వికలాంగులకు అందిస్తున్న సేవలపై ఆశ్రమ నిర్వాహకులు వలపర్ల రవికుమార్‌ను అభినందించారు. ఆశ్రమంలో ఉన్న దివ్యాంగులకు రూ.5,116లు అందించారు. కార్యక్రమంలో మంగయ్య కుమారుడు, ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు ప్రసాద్, ట్రస్ట్ అధ్యక్షుడు నర్సన్, నిర్వాహకులు ఝాన్సీలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం మరమ్మతులకు..

ఏన్కూరు: ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణానికి మండలానికి చెందిన శెట్టిపల్లి నారాయణ బసవమ్మ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు మరమ్మతులు చేయించారు. మట్టి తోలకాలు చేయించి రోలర్ తో ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు సుందర్, కృష్ణ ప్రసాద్, బాబూలాల్, రామారావు, లక్ష్మీ నరసింహా, రమాదేవి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వైరారూరల్: మండలంలోని గొల్లెనపాడు యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు శనివారం విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోర్డినేటర్ పెనుగొండ ఉపేంద్రరావు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్ పర్సన్ రాములమ్మ, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రామకృష్ణ, సాంబచారీ, తిరుమలయ్య, సరిత, శైలజ, చంద్రశేఖర్, భాస్కర్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


రథయాత్రను జయప్రదం చేయండి

మధిర: సుప్రింకోర్టు తీర్పును అనుసరిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ.. ఫిబ్రవరి 7న ఖమ్మంలో జరిగే లక్ష డప్పుల రథయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మధిరలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేకల రాజా అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కొండూరు రాజేష్ మాదిగ, రాజారత్నం మాదిగ, గట్టిగుండె కిషోర్ మాదిగ, కుక్కల బాబు, జోసెఫ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో 'లయన్స్‌క్లబ్' ముందంజ

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉంటుందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌బీ గార్డెన్‌లో నిర్వహించిన మెంబర్స్ ఇంట్రక్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో నిరుపేద మహిళలకు రూ.45వేలు విలువ చేసే ఏడు కుట్టు మిషన్లు, రూ.27 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను ముత్యాలమ్మ గుడికి, దివ్యాంగులక వీల్ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా గవర్నర్ ప్రభాకర్‌రెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలను నివారించండి



మాట్లాడుతున్న వైద్యాధికారి సతీష్‌బాబు

ముదిగొండ: ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి 8లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటుండగా, ఒక్క భారతదేశంలోనే రెండున్నర లక్షల మంది ఉంటున్నారని ప్రముఖ సైకియాట్రిస్ట్ రావులపాటి సతీష్‌బాబు పేర్కొన్నారు. శనివారం ముదిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో 'మనసును జయించండి – మానసిక ఒత్తిడి'ని అధికమించండి అనే సదస్సులో ఆయన మాట్లాడారు. యువత ముత్తపదార్థాలకు బానిస కావొద్దని.. పరీక్షల్లో ఫేలై ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. ఎక్కువగా 15ఏళ్ల నుంచి 35ఏళ్ల వారు అధిక సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి రఘుబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేంసూరు: మండలంలోని రాయుడుపాలెం వైకుంఠపురం కొండపై కోలువైన శ్రీ బాలాజీ కల్యాణ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నుడుమ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాయుడుపాలెం మాజీ సర్పంచ్ మేడా వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ ఈడా కృష్ణ, గుత్తా రవిచంద్ర, ఉప్పల వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన 'పువ్వాళ్ల'

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ పణవి పిల్లింగ్ స్టేషన్ ఇండియాన్ ఆయిల్ పెట్రోల్, డిజిల్ బంక్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యత కలిగిన పెట్రోల్‌ను అందించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, రాంపూడి రోశయ్య, పాలేటి నర్సింహరావు, ఏదునూరి సీతారాములు, పొదిలి హరినాథ్, సూరంపల్లి రామారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, పల్లపు కొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ఏన్కూరు: 2024లో నూతనంగా ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ పాఠశాల పరిధిలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఏన్కూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం సైదయ్య తెలిపారు. శనివారం నూతన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 6 నుంచి 11 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి తప్పని సరిగా బడిలో చేర్పించాలని, విద్యార్థుల హాజరు సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఎస్‌టీఓ నుంచి మంజూరైన ప్రాన్ కిట్లు అందజేశారు.

యానంలో హ్యూమన్ రైట్స్ సేవలు

కల్లూరు: పాండిచ్చెరి కేంద్రపాలిత ప్రాంతం యానం జిల్లాలో అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలను శనివారం హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు సందర్శించి అక్కడ విద్యార్థులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దాసు, నేషనల్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు రుక్మిణి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యేసు పాల్గొని చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నేతాజీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ జీవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సత్తుపల్లి ఎంవీఐ జె.ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యాన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలలోపు వారు వాహనాలు నడపటం చట్టరీత్యానేరమని స్పష్టం చేశారు. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108, పోలీసులకు ఫోన్ చేయటంతో పాటు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ముందుగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు చెప్పిన వారికి ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ దినేష్, పాఠశాల నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ



మధిర: రాజశేఖర్ రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం



తల్లాడ: తృతీయ బహుమతి అందుకుంటున్న పినపాక ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఆసీఫ్

- **మధిర:** మధిర పట్టణానికి చెందిన భరత్ టెక్నో స్కూల్ విద్యార్థి శీలం రాజశేఖర్ రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం ఖమ్మంలో తెలంగాణ స్టేట్ సోషల్ ఫోరం వారు నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాజశేఖర్ రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, డైరెక్టర్ విద్యాలత ఆ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో పాఠశాల ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ కటికల రవీందర్ రెడ్డి, స్రవంతి, సోషల్ టీచర్ భవాని, నాగరాజు, ప్రసాద్, గోపాలకృష్ణ, శశికళ ఉన్నారు.
- **సత్తుపల్లిరూరల్:** సోషల్ టాలెంట్ టెస్ట్‌లో సత్తుపల్లి మండలం రేజర్ల హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని పంతంగి లక్ష్మీప్రసన్న తెలుగు మీడియం విభాగంలో మొదటి ర్యాంక్ సాధించింది. దీంతో విద్యార్థితో పాటుగా.. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులరాలు కమలకుమారిని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి జలదాని తన్మయ్‌శ్రీజ జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించగా షీల్డ్, రూ.2వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అరుణ, స్కూల్ ఇన్‌చార్జ్ శంకర్ అభినందించారు.
- **తల్లాడ:** ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో తల్లాడ బాలభారతి విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎస్.శ్రీ లక్ష్మీ శ్రీజ ప్రతిభ కనబరచి 2వ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బాలభారతి విద్యాలయం కరస్పాండెంట్ కె.ప్రవీణ్, కెఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ టి.రామారావు, ఏఓ శశాంక్ లక్ష్మీ శ్రీజను అభినందించారు.

పినపాక విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక..

మండలంలోని పినపాక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్.ఆసీఫ్ మూడో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో..



ద్వితీయ స్థానం సాధించిన నడ్డి ప్రవీణ్‌కుమార్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం హెచ్‌ఈపీఎస్ చదువుతున్న నడ్డి ప్రవీణ్‌కుమార్ ఇటీవల జరిగిన కరాటే పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాడు. జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించటంతో పాటు.. రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించాడు. దీంతో విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ గోపి, అధ్యాపకులు అభినందించారు.

కవిత రచనలో 'అవినాష్'

తల్లాడ: కొత్తగూడెం బాలోత్సవ్ చిల్డ్రన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కథా కవిత రచన కార్యశాల పోటీల్లో తల్లాడ బాలభారతి విద్యాలయానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సుధా అవినాష్ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో ఆమెను ఆ విద్యాలయం కరస్పాండెంట్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌లో..



జావలిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3వ తేదీన ఇంగ్లీష్ లాంగ్వేజ్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్ష, ఉపన్యాస పోటీలు జరిగాయి. కాగా ఈ పోటీల్లో మండలంలోని రేమిడిచర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పెండ్లి జావలి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను రేమిడిచర్ల పాఠశాలలో హెచ్‌ఎం కె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, పద్మ, పుల్లమ్మ, రాంబాబు, ఫణికుమార్, సతీష్, వజీర్ తదితరులున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

చింతకాని: ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంఈఓ మోదుగు శ్యాంసన్‌ను మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం సన్మానించగా డీఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమణ, శ్రీనివాసరావు, విజయభాస్కర్, ప్రభాకర్‌రెడ్డి, సైదులు, సత్యనారాయణ, చెన్నకేశవరెడ్డి, జలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చింతకాని: మండలంలోని బస్వాపురంలో అనారోగ్య బాధితుడు దాసరి సాయికుమార్‌కి శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కన్నెబోయిన గోపి రూ.45వేలసీఎం సహాయ నిధి చెక్కును అందించాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ షాజహాన్, కుక్కల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

బోనకల్: ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య తెలిపారు. మండల పరిధిలోని పెద్దబీరవల్లి పాఠశాలలో నిర్వహించిన సత్యనారాయణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, ఏఏపీసీ చైర్మన్ మహబూబ్‌బీ, రైతు సంఘం, యువజన సంఘం, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు'



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చింతకాని: రైతులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ విషయంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హామీలు నెరవేర్చకపోతే గత ప్రభుత్వాలకు పట్టిన గతే మీకు పడుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎంను ఆదరించండి



ప్రచారం నిర్వహిస్తున్న వీరభద్రం, తదితరులు

వైరా: నిరంతరం ప్రజల పక్షాన పోరాడే సీపీఎం ను ప్రజలు ఆదరించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడులో గడప గడపకు సీపీఎం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ఉద్యమాలు బలోపేతం చేయాలన్నారు. పాలక ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్, చలపతిరావు, మణి, నరసింహారావు, రవి, రామారావు, వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.